# ఆంధ్రప్రదేశ్... తలసరి అభివృద్ధి వ్యయం

**వివిధ రాష్ట్రాల బడ్జెట్‌లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేసిన అధ్యయనంలో రాష్ట్ర హోదా పొందిన కేంద్రపాలిత ప్రాంతాలు మినహా మిగతా రాష్ట్రాలన్నింటిలో తలసరి అభివృద్ధి వ్యయంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. 2004-05 తర్వాత ఈ వ్యయం మరింత పెరిగింది. 2004-08 మధ్య కాలంలో దేశ జీడీపీ వృద్ధి కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వ్యయ విషయంలో ఇదే ఒరవడిని కొనసాగించితే భవిష్యత్‌లో రాష్ట్రం బలమైన ఆర్థిక శక్తిగా రూపుదిద్దుకోగలదు.**

ఇటీవల కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో మమేకమైన భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సంబంధించి అనుకూల వాతావరణం ఏర్పడినప్పటికీ ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, వృద్ధికి సంబంధించి స్థిరత్వం సాధించడంలో మాత్రం కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. దీంతో పాటు గతేడాది సాధించిన జీడీపీ వృద్ధి రేటు 9 శాతాన్ని నిలుబెట్టుకోవడం ప్రస్తుతం ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. 2004-08 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ స్థూల దేశీ యోత్పత్తి వృద్ధి రేటు 10 శాతం ఉండగా అది 2008-09లో 5.53 శాతం మాత్రమే నమోదు కావడం ఆందోళన కలిగించే పరిణామం. ఈ నేపథ్యంలో 2009-10 బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయం, నీటిపారుదల రంగానికి పెద్ద పీట వేసింది. ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా రాష్ట్రంలో పారిశ్రామికీకరణను వేగవంతం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచి ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రాధాన్యమిచ్చింది. దీనికి తోడు అధిక వృద్ధి సాధించడానికి, పెట్టుబడులకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్న నేపథ్యంలో.. అధిక పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా కీలక రంగాలైన నీటిపారుదల, గృహ నిర్మాణంతోపాటు, మౌలిక ప్రాజెక్టులైన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలకు సంబంధించి పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్య మివ్వాలి.

### వ్యవసాయం, నీటిపారుదల రంగం:

రాష్ట్రంలో మొత్తం శ్రామికశక్తిలో 62 శాతం మంది వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడ్డారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీతో పాటు అనేక ప్రోత్సాహకాలు ఈ రంగం అభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేశాయి. 2004-09 మధ్య కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో వార్షిక వృద్ధిరేటు రాష్ట్రంలో 8.98 శాతం



కాగా, జాతీయ స్థాయి వృద్ధి రేటు 1.9 శాతం మాత్రమే. జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగ వృద్ధి రేటు లక్ష్యం 4 శాతం కాగా 2004-09 మధ్య కాలంలో రాష్ట్రం..6.4 శాతం వృద్ధి నమోదు చేసుకుంది. రాష్ట్ర వ్యవసాయ రంగంలో ఈ కాలాన్ని 'స్వర్ణయుగం'గా భావించవచ్చు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత గల ఉత్పాదకాలు, సకాలంలో పరపతి సౌకర్యం కల్పించేందుకు దోహదపడే రైతు సహకార సంఘాలను ప్రతి జిల్లాకు రెండు గ్రామాల్లో ఈ ఏడాది ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞం కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 81 ప్రాజెక్టులను రూ. 1.76 లక్షల కోట్లతో చేపట్టింది. వీటి ద్వారా 100.38 లక్షల ఎకరాల భూమికి అదనంగా సాగు నీరు అందడంతో పాటు 21.75 లక్షల ఎకరాల భూమికి నీటి సౌకర్యం విషయంలో స్థిరీకరణ సాధించవచ్చు. 'కృష్ణా వాటర్ వివాదాల ట్రిబ్యునల్' ఆంక్షలు తొలగిస్తే మహ బూబ్‌నగర్, నల్గొండ, ప్రకాశం, నెల్లూరు,రాయలసీమ జిల్లాల్లో కృష్ణానది కింద అదనంగా 24.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు లభిస్తుంది. ఈ విధమైన సమగ్రమైన నీటిపారుదల విధానం ద్వారా వ్యవసాయ రంగంలో నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు తాగునీటి అవసరం కూడా తీరుతుంది.

వ్యవసాయికంగా వెనుకబడిన ప్రాంతాలకు నీటిపారుదల సౌకర్యాలు విస్తరించడం ద్వారా ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పనుల్లేని సమయంలో వ్యవసాయ కూలీలకు గ్రామీణ పబ్లిక్ వర్క్స్‌లో ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణం పెంచేందుకు ప్రయత్నించాలి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని రాష్ట్రాల బడ్జెట్‌లను పరిశీలించినపుడు పట్టికలో పేర్కొన్న 17 రాష్ట్రాల విషయంలో తలసరి అభివృద్ధి వ్యయానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. రాష్ట్ర హోదా పొందిన కేంద్రపాలిత ప్రాంతాలు గోవా, సిక్కిం, పుదుచ్చేరిలు అభివృద్ధి వ్యయంలో ఆంధ్రప్రదేశ్ కంటే ముందుండటానికి.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్లు, ఇతర రుణ సౌకర్యాలే కారణం.

1998-99తో పోల్చినపుడు 2004-05 తర్వాత కాలంలో రాష్ట్రంలో

| వివిధ రాష్ట్రాల తలసరి అభివద్ధి వ్యయం (రెవెన్యూ ఖాతా) రూ.లలో. | | | | | |
|---|---|---|---|---|---|
| **రాష్ట్రాలు** | **98-99** | **03-04** | **06-07** | **07-08** | **08-09** |
| ఆంధ్రప్రదేశ్ | 1507 | 2322 | 3197 | 4439 | 6002 |
| అస్సాం | 1097 | 2344 | 2441 | 3725 | 3820 |
| బీహార్ | 619 | 784 | 1302 | 1540 | 1905 |
| ఢిల్లీ | 1589 | 2269 | 2699 | 3635 | 4200 |
| గుజరాత్ | 2290 | 2675 | 3071 | 3437 | 3961 |
| హర్యానా | 2192 | 2899 | 4834 | 5309 | 5386 |
| జమ్ము కాశ్మీర్ | 3151 | 4370 | 5019 | 5256 | 5530 |
| కర్ణాటక | 1567 | 2610 | 3783 | 4331 | 5013 |
| కేరళ | 1775 | 2808 | 2722 | 3418 | 3837 |
| మధ్యప్రదేశ్ | 1167 | 1514 | 1845 | 2238 | 2667 |
| మహారాష్ట్ర | 1663 | 2774 | 3361 | 3852 | 3928 |
| ఒరిస్సా | 1144 | 1511 | 2035 | 2706 | 3047 |
| పంజాబ్ | 1697 | 2887 | 3011 | 4222 | 4126 |
| రాజస్థాన్ | 1344 | 1887 | 2314 | 2931 | 2993 |
| తమిళనాడు | 1771 | 2374 | 3174 | 3746 | 4285 |
| ఉత్తరప్రదేశ్ | 835 | 1145 | 1542 | 2001 | 2166 |
| పశ్చిమబెంగాల్ | 1057 | 1466 | 1839 | 2273 | 2485 |
| అన్ని రాష్ట్రాలు | 1358 | 2018 | 2586 | 3181 | 3565 |

(**ఆధారం:** కేంద్ర గణాంక సంస్థ, రాష్ట్రాల బడ్జెట్ - ఆర్‌బీఐ పరిశీలన)

తలసరి అభివృద్ధి వ్యయం రాష్ట్రంలో గణనీయంగా పెరిగింది.

## అభివృద్ధేతర వ్యయం -రెవెన్యూ ఖాతా:

2008-09లో సిక్కింలో తలసరి అభివృద్ధేతర వ్యయం ఎక్కువ. బీహార్‌లో తక్కువ. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ కంటే అరుణాచల్ ప్రదేశ్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కేరళ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, మణిపూర్, పుదుచ్చేరిలు ముందున్నాయి. అభివృద్ధి వ్యయాన్ని పెంచుకుంటూ అభివృద్ధేతర వ్యయాన్ని తగ్గించుకోవడం ద్వారా మన రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి భవిష్యత్‌లో మరింత వేగం కాగలదు.

## ఆంధ్రప్రదేశ్-ప్రస్తుత స్థితి:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక-ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. చేనేత కార్మికుల ఆత్మహత్యలు పెరిగిన దరిమిలా వారికి అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. రాజీవ్ ఆరోగ్య శ్రీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, రెండు రూపాయలకు కిలో బియ్యం, పెన్షన్లు, వెనుకబడిన వర్గాలకు గృహ నిర్మాణం, ఇందిరప్రభ, స్వయం సహాయక బృందాలు, ముస్లింలకు రిజర్వేషన్లు, ఆమ్ ఆద్మీ బీమా యోజన, అభయహస్తం లాంటి పథకాలు సాంఘిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. ఉన్నత విద్యా వ్యాప్తి కోసం అనేక యూనివర్సిటీలను స్థాపించారు. 'ఆరోగ్యశ్రీ' పథకం రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యప్రమాణాలు మెరుగుపడటానికి దోహదం చేసింది. ప్రతిరోజూ ఈ పథకం ద్వారా సగటున 1100 సర్జరీలు జరుగు తుండగా వీటికి అయ్యే ఖర్చు రోజుకు రూ.3.5 కోట్లు. పారిశ్రామికీకరణను ప్రోత్సహించడానికి 'పారిశ్రామిక-పెట్టుబడుల ప్రోత్సాహక విధానం 2005-10' కింద కొత్త పరిశ్రమలకు అనేక ప్రోత్సాహకాలు, రాయితీలిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలి.

## 2009-10 బడ్జెట్- వివిధ రంగాలకు కేటాయింపులు:

2009-10 బడ్జెట్‌లో కేటాయింపులను పరిశీలిస్తే సాంఘిక, సంక్షేమ రంగానికి ప్రాధాన్యత ఇచ్చినట్లుగా భావించవచ్చు. నీటిపారుదల రంగానికి రూ. 17,800 కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ. 6040 కోట్లు, వ్యవసాయం,అనుబంధ రంగాలకు రూ.2612 కోట్లు కేటాయించారు. సంక్షేమ రంగానికి రూ. 5532 కోట్లు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.312 కోట్లు, గృహ రంగానికి రూ.1800 కోట్లు కేటాయించారు. జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా 50,000 మంది టీచర్లను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రాథమిక, పాఠశాల విద్యకు రూ. 8413 కోట్లు, ఉన్నత, సాంకేతిక విద్యకు రూ. 2737 కోట్లు కేటాయించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు రూ. 260 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ. 3821 కోట్లు కేటాయించారు. ఏపీ రాష్ట్ర హైవేస్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 8072 కోట్లుగా నిర్ణయించి రూ. 200 కోట్లు కేటాయించారు.

## ముఖ్యాంశాలు:

- రాష్ట్రంలోని మొత్తం శ్రామిక శక్తిలో 62 శాతం మందికి వ్యవసాయం, అనుబంధ రంగాలే ఆధారం.
- 2004-09 మధ్య కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తిలో రాష్ట్ర వృద్ధి రేటు 8.98 శాతం.
- 2008-09 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ కంటే అరుణాచల్‌ప్రదేశ్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, కేరళ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, మణిపూర్, పాండిచ్చేరిల అభివృద్ధేతర వ్యయం ఎక్కువ.
- ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో రోజుకు సగటున 1100 శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.
- రూ. 8072 కోట్లు అంచనాతో తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ హైవేస్ అభివృద్ధి ప్రాజెక్టుకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 200 కోట్లు కేటాయించారు.